# అమ్మ వ్యక్తిత్వం

**జీవితమనే రైలు ప్రయాణంలో బంధాలు, అనుబంధాలు- అన్నీ తాత్కాలికాలే. భర్త పోయి, బిడ్డలు దూరం జరిగాక ఆ అమ్మ తన ఒంటరి జీవితానికి చెప్పిన కొత్త అర్థం ఏమిటి? ఆ విశిష్ట వ్యక్తిత్వానికి పరమార్థం ఏమిటి?**

"అమ్మా, మీ అల్లుడుగారు ఉత్తరం రాశారు 'రేఖ పరీక్షల టైమ్‌కైనా వైజాగ్ రావడానికి ట్రై చెయ్యి' అంటూ. నేను వచ్చి కూడా అప్పుడే రెండు నెలలు అయింది కదా!"

కూతురు మనోరమ మాటలకు అడ్డొస్తూ, "అదేంటమ్మా, నిన్ను మీ ఇంటికి వెళ్ళవద్దని ఎలా శాసిస్తాను? నువ్విన్నాళ్ళు ఇక్కడ ఉండడమే ఎక్కువ. పాపం, సురేష్ ఎన్నాళ్ళు పిల్లలతో అవస్థపడతాడు" అంది విమల.

"ఓ.కే మమ్మీ. నేను మా ఊరు వెళ్ళిపోతాను. నువ్వు ఒక్కదానివి ఇంత పెద్ద ఇంట్లో ఎలా ఉంటావ్? నాతో మా ఊరు వస్తే నీకు పోయేదేమిటి మమ్మీ?"

"రమా, నువ్వు మీ ఊరు రమ్మంటూ నన్నడగడం, రమ్మన్న ప్రతిమారూ నేను రాలేనంటూ చెప్పడం ఏం బాగుంటుంది చెప్పు! ఈ ఇంటిని విడిచి నేనెక్కడికీ రాను, రాలేను. మీ నాన్నగారు పోయారని మీరందరూ అంటున్నా నాకెందుకో ఆయన ఇక్కడే తిరుగాడుతున్నట్లు ఉంటుంది. ఆయన స్మృతులు నన్నింకా వెంటాడుతూనే ఉన్నాయి..." మాటలు రానిదై మౌనముద్ర దాల్చింది విమల.

గాఢంగా నిట్టూర్చింది మనోరమ.

అమ్మ మౌఢ్యం అర్థం కాదు.

ఆరోగ్యం దెబ్బతిని, అరవై ఏళ్ళు పైబడ్డ ఈ చరమ దశలో ఎందుకీవిడ ఏకాకిగా ఇక్కడే 'ఉండిపోతా'నంటోందో మనోరమకు అంతు చిక్కడం లేదు.

అన్నయ్యల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.

పెద్దన్నయ్య వినోద్ అమెరికా నుండి నాన్న చనిపోయిన పదవ రోజుకు కానీ రాలేకపోయాడు.

చిన్నన్నయ్య ప్రమోద్ రావడం అయితే వచ్చాడు కానీ, 'నా భార్య నిండు గర్భిణి' అంటూ ఉన్న పది రోజులూ ఆవిడ సేవలకే పరిమితం అయ్యాడు.

అమ్మకి కొంతకి కొంత సాంత్వన కలిగించింది తానూ, తన భర్త సురేష్, తన పిల్లలు ప్రణవ్, సురేఖలే.

'ఎలాగూ అమ్మ తనతో రాదు' అన్నట్లు బిహేవ్ చేసి, వచ్చిన వారానికే అమెరికా చెక్కేశాడు వినోద్.

'లక్నోలో ఎముకలు కొరికే చలి. అంత చలి అమ్మ భరించలేదు...' అంటూ ప్రమోద్ ఇచ్చిన వాతావరణ సూచనకి అమ్మకు చీకాకు వేసి, 'ఒరేయ్, నువ్వు బెంగెట్టుకోకురా. నేను రాను కాక రాను మీ లక్నోకి. అయినా, ఇక్కడ నాకు అలవాటైన డాక్టరుండగా అక్కడికి వచ్చి అవస్థ పడడమెందుకు' అంటూ కొట్టిపడేసింది.

'సరే, నీ ఇష్టం. ఒక్కదానివీ ఎలా ఉంటావిక్కడ? నలుగురూ ఏమనుకుంటారు? నీ ఆరోగ్యం గురించి మాకు బెంగ ఉండదా? ఈ ఊర్లో మా స్నేహితుడొకడు ఒక మంచి ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వహిస్తున్నాడు. అందులో చేరిపో. అన్ని సౌకర్యాలూ ఉంటాయి. మాకూ నిశ్చింతగా ఉంటుంది' అంటూ ప్రమోద్ ప్రపోజల్ ఇచ్చినప్పుడు మాత్రం చెప్పరాని కోపం వచ్చింది అమ్మకు.

తెగేసి చెప్పింది అమ్మ, తాను 'ఇల్లు వదిలి ఏ వృద్ధాశ్రమాలకూ వెళ్ళను' అంటూ.

> 'నాకీ ఇల్లూ, పరిసరాలు అలవాటయ్యాయి. నేను ఈ ఊరు వదిలి ఎక్కడికీ రాలేను. నన్ను బలవంతపెట్టకండి.'

తానున్నది వైజాగ్‌లోనే కదా, తన దగ్గరికి రావచ్చు అమ్మ. అమ్మంటే ఎంతో గౌరవమిచ్చే తన భర్త సురేష్ ఎంతో సంతోషిస్తాడు. ప్చ్... కొందర్ని ఈ జన్మలో మార్చలేం.

'నాకీ ఇల్లూ, పరిసరాలు అలవాటయ్యాయి. నేను ఈ ఊరు వదిలి ఎక్కడికీ రాలేను. నన్ను బలవంతపెట్టకండి ప్లీజ్' అంటూ పదేపదే చెబుతున్న అమ్మను ఒప్పించి వైజాగ్‌కి తరలించడం ఎలాగో అర్థం గాక లేచి వెళుతున్న కూతుర్ని సమీపించింది విమల.

"రమా, నువ్వొస్తున్నట్లు సురేష్‌కి వెంటనే ఉత్తరం రాయి. విశ్వానికి చెప్పి టికెట్ రిజర్వు చేయించుకో. నన్ను గురించి దిగులు పెట్టుకోకు. నాకేం కాదు. నేను చెప్పానుగా పి.జిలు కావాలంటూ పేపరులో ప్రకటన ఇప్పించానని. ఇవ్వాళో, రేపో ఎవరో ఒకరు రాకపోరు. నాకు నచ్చిన వాళ్ళని సెలెక్ట్ చేసుకుంటాను."

"ఎందుకమ్మా నీకీ వయసులో పేయింగ్ గెస్టులు?"

"ఆగు రమా. ఏదో నా వెనులుబాటు కోసం పేయింగ్ గెస్టుల్ని తీసుకుంటున్నాననుకుంటున్నావా? ఊహూఁ. నా కాలక్షేపం కోసం, నా తోడు కోసం, నా భద్రత కోసం నేనీ నిర్ణయానికొచ్చాను. 'మూడు పడగ్గదుల ఫ్లాట్ - అబ్బాయిలకిద్దరికీ రెండు, మనకొకటి' అంటూ మురిసిపోయి ఈ త్రీ బెడ్ రూమ్ ఫ్లాట్ కొన్నారా రోజు మీ నాన్నగారు. చూశావామ్మా, ఇప్పుడీ అదనపు పడగ్గదులు రెండూ ఈ విధంగా నాకు ఉపయోగపడబోతున్నాయి."

"పేయింగ్ గెస్టులంటే మాటలనుకుంటున్నావా? ఆ వచ్చే వాళ్ళకి అన్ని సౌకర్యాలూ కలిగించాలి. బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ అంటూ డిమాండ్ చేస్తారు. అపవేళా, అర్ధరాత్రి ఎవరెవర్నో తీసుకొస్తారు. ఎందుకమ్మా తలనొప్పి కొనితెచ్చుకుంటావ్?"

"ఎవరినంటే వాళ్ళని ఎందుకు చేర్చుకుంటాను? వాళ్ళ పూర్వాపరాలన్నీ తెలుసుకునే ఎన్నుకుంటాను. పాతికేళ్ళుగా పనిచేస్తున్న జయమ్మ తన కోడలు కాంతాన్ని వంటకి పెడతానంది. జయమ్మ కొడుకు విశ్వం ఎలాగూ ఉండనే ఉన్నాడు. 'అయ్యగారు ఆనాడు నాలుగుముక్కలు నేర్పించి బళ్ళో వేసి చదివించిన ఫలితంగానే నాకీ అటెండర్ ఉద్యోగం వచ్చింది అమ్మగారూ. ఇదంతా అయ్యగారి చలవే' అంటూ నమ్మిన బంటులా ఇంటి చుట్టూ తిరుగుతూ ఉంటాడు. నీకు తెల్సుగా, మీ నాన్న మంచాన పడినప్పుడు అన్నీ వాడేగా చేసేవాడు అహోరాత్రులూ..."

"అది నిజమే అనుకో..."

"అమ్మాయ్, నువ్వింకేమీ ఆలోచించకు. నీ ప్రయాణం ఏర్పాట్లు చేసుకో. అదో, ఫోను మోగుతోంది. అల్లుడుగారు కాబోలు. త్వరగా వైజాగ్ వస్తున్నానని చెప్పు." ప్రసంగాన్ని అక్కడితో ఆపేసింది విమల.

* * *

అమ్మని చూసి అప్పుడే ఆరు నెలలయింది.

ఆమె దగ్గరికి అదో వెళ్దాం, ఇదో వెళ్దాం అనుకుంటూనే ఇంతకాలం గడిచి పోయింది. టెలిఫోన్ సౌకర్యం ఉండబట్టి సరిపోయింది. లేకుంటే తానిన్నాళ్ళు అమ్మ దగ్గరికి వెళ్ళకుండా ఉండేదా?

వేసవి సెలవుల్లో ఏకంగా పిల్లలతో వద్దామనుకుంది. కానీ, అన్నయ్య ప్రమోద్ ఘాటుగా ఉత్తరం రాయడంతో ఇలా బయలుదేరింది ఉన్నట్లుండి.

అయినా, అమ్మ ఎందుకిలా చేసిందో! మనోరమ ఆలోచనలు ఆటోతో పోటీ పడి పరుగులు తీస్తున్నాయి.

ఆటో దిగిన మనోరమను చూచి, పరుగెత్తుకుంటూ వచ్చిన వాచ్‌మన్ చేతికి సూట్‌కేసు అందించి, లిఫ్ట్‌కేసి నడిచింది మనోరమ.

బజర్ నొక్కగానే తలుపు తెరిచిన విమల, "రా రమా, ఇప్పుడే రైల్వే స్టేషన్‌కి ఫోన్ చేశాను. ట్రెయిన్ కరక్ట్ టైమ్‌కే వచ్చిందన్నారు. అల్లుడుగారూ, పిల్లలూ బాగున్నారు కదా!" ఆప్యాయంగా పలకరించింది కూతుర్ని.

నవ్వుతూ అడుగుపెట్టిన మనోరమకి ఆ ఇంటి వాతావరణమంతా ఏంటో కొత్తకొత్తగా, ఎవరింటికో వచ్చినట్లు అనిపించింది.

కుర్చీలు, సోఫాలు కొత్తవి చోటుచేసుకున్నాయి. విమలతో పాటు లోపలికి వెళుతున్న మనోరమ పక్క బెడ్‌రూమ్ లోనుంచి బయటకు వస్తున్న పెద్దావిడని చూసి ఆగిపోయింది.


"అదేమిటి రమా, ఎవర్నో కొత్తవాళ్ళని చూసినట్లు చూస్తున్నావ్. ముంతాజ్ ఆంటీ కదూ. చిన్నప్పటి నా బెస్ట్ ఫ్రెండ్ అండ్ క్లాస్‌మేట్. మనం ఆగ్రా వెళ్ళినప్పుడు ఈ ఆంటీ వాళ్ళింటికి వెళ్ళాం గుర్తు లేదా?"


"ఔనౌను... గుర్తుకొస్తున్నారు... ఎలా ఉన్నారు ఆంటీ?" మొక్కుబడిగా, ముక్తసరిగా పలకరించి లోనికి నడిచింది మనోరమ.

డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని కాఫీ తాగుతున్న కూతురు వద్దకు వచ్చింది విమల.

"రమా, నువ్వు కాఫీ తాగాక స్నానం ముగించేయ్. నేను దేవుడికి దీపం పెట్టుకొని వస్తాను. తర్వాత తీరుబడిగా కబుర్లు చెప్పుకుందాం. అయినా అమ్మాయ్, వస్తున్న దానివి పిల్లల్ని కూడా తీసుకురావచ్చుగా. అదేమంటే, పరీక్షలంటావ్." నవ్వుతూ పూజగది కేసి నడిచింది విమల.

కాంతం వంట చేసి వెళ్ళాక కబుర్లకి కూర్చున్నారు తల్లీకూతుళ్ళు






"అమ్మా, నాకు తెలీక అడుగుతాను - నువ్వు చేస్తున్న ఈ పని ఏమైనా బాగుందా చెప్పు" అంది మనోరమ ఉరుము లేని పిడుగులా.


"ఏ పని రమా నువ్వనేది?"

"అదే నీ పేయింగ్ గెస్టుల గురించే. నువ్వామధ్య ప్రస్తావిస్తే మన ఆచార సంప్రదాయాలకీ, మన అలవాట్లకీ, పద్ధతులకీ సరిపడే వాళ్ళని తీసుకుంటావనుకున్నాను. కానీ, ఇలా... నీ కన్నా పెద్దవాళ్ళని - అన్నట్లు మరో పేయింగ్ గెస్ట్ ఎవరన్నావ్ - ఎలిజబెత్ ఆంటీ. ఆవిడే పబ్లిక్ స్కూల్లో నీ కొలీగ్, వైస్ ప్రిన్స్‌పాల్‌గా పనిచేసి రిటైర్ అయ్యారే. ఆ ఆంటీయే కదూ. ప్రమోద్ అన్నయ్య ఎంతో నొచ్చుకుంటూ



రాశాడు - మన ఇల్లు నానా జాతి సమితి అయిందంటూ. వాళ్ళ అత్తగారు నిన్ను చూడ్డానికని వస్తే ముంతాజ్ ఆంటీ నమాజ్ చేసుకుంటూ, ఎలిజబెత్ ఆంటీ బైబిల్ చదువుకుంటూ దర్శనమిచ్చారట."

"రమా, ఇక ఆపు. ఏమిటా వెటకారం? వాడు రాయడం, నువ్వు నన్ను సంజాయిషీ అడగడం. బాగుంది. అయినా, నువ్వు నన్ను చూసిపోదామని వచ్చావా, దండించి పోదామని వచ్చావా? వాడు, నీకే కాదు, నాకూ రాశాడు పెద్ద ఉత్తరం. చూడమ్మా, మీకెవరికీ



చిత్రాలు: నర్సిం

సమాధానాలు, వివరణలు ఇచ్చుకోవలసిన అవసరం నాకు లేదు." కోపంగా అంది విమల.

"అది కాదమ్మా..."

"ఏది కాదు? అమెరికాలో ఉన్న వినోద్‌కి ఈ అమ్మని గురించిన ఆలోచన కానీ, అవసరం కానీ ఏనాడూ రాలేదు. మన దేశంలోనే ఉంటున్న ప్రమోద్ - విన్నావుగా ఆనాడు వాడేమన్నాడో - ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చేరిపొమ్మని ఓ ఉచిత సలహా పడేశాడు. కాదన్నందుకు 'గుడ్ రిడన్స్' అన్నట్లు చేతులు దులిపేసుకున్నాడు. ఎంతయినా ఆడపిల్లవి - నీ దగ్గరికి రమ్మంటూ బతిమాలావు, బామాలావు. కన్న పిల్లల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి జీవించకూడదనే ఈ పేయింగ్ గెస్టులను చేర్చుకునేందుకు నిర్ణయం తీసుకున్నాను. ముంతాజ్‌ని, ఎలిజబెత్‌ని నేనేమీ కావాలని ఎంపిక చేసుకోలేదు. అదలా కాకతాళీయంగా జరిగిపోయింది. పిల్లలు ఇద్దరున్నా, ముగ్గురున్నా వృద్ధాప్యంలో భార్యాభర్తలలో ఏ ఒక్కరు ముందుగా మరణించినా మిగిలినవారు ఏకాకిగా మిగిలిపోవడం అన్నది సర్వసాధారణం అయిపోతున్న ఈ రోజుల్లో, ఆ ఒంటరి జీవితాలకు పిల్లల నిరాదరణ కూడా తోడైతే ఇక అంతకన్నా దురదృష్టమేముంటుంది చెప్పు."

"అలా అని ఎందుకనుకుంటావమ్మా..."

"చూడు రమా, మధ్యలో నన్నాపకు. నేను మిమ్మల్ని తప్పు పట్టడం లేదు. ఎవరి జీవిత సరళి వాళ్ళే నిర్ణయించుకొని తమకు అనుగుణమైన రీతిలో నడవడం ఈనాటి సామాజిక న్యాయం. నలుగురు కొడుకులుండీ తానో వృద్ధాశ్రమంలో చేరిపోతున్నట్లు ముంతాజ్ చెప్పగా విని ఆశ్చర్యపోయాను. ఎలిజబెత్ పరిస్థితి కూడా ఏమంత భిన్నంగా లేదు. కంప్యూటర్ ఉద్యోగాల మాయాజాలంలో కన్నకొడుకులిద్దరూ డాలర్ల కోసం పరుగులు తీసి క్యాలిఫోర్నియా వెళ్ళిపోతే, ఆ పరుగుపందెంలో వెనుకబడి, ఒంటరిదైన, తోడు, ఆదరణ, ఓదార్పు కోసం తపించిపోతూ, ఓ రోజు నన్ను కలిసింది.

వాళ్ళిద్దర్నీ చూసి, వాళ్ళ బాధలను అర్థం చేసుకొని, అభ్యంతరం లేకపోతే పేయింగ్ గెస్టులుగా ఈ లోగిలిలోకి రమ్మంటూ వాళ్ళని ఆహ్వానించాను. ఆనాడు నువ్విచ్చిన సలహా నా మెదడులో మెదలుతూనే ఉంది. ముక్కూ మొహం తెలియనివాళ్ళని చేర్చుకొని అవస్థపడేకన్నా నాకిదే మేలనిపించింది. మేమంతా దాదాపు సమ వయస్కులం. స్నేహితులం. ఒకరి కష్టసుఖాలు మరొకరు అర్థంచేసుకొని పంచుకొనే పరిణతికి ఎదిగినవాళ్ళం..."

"బాగానే ఉంది కానమ్మా, నువ్వు చేస్తున్న పనికి మన బంధువులు ఏమనుకుంటున్నారో ఆలోచించావా?"

"రమా, నువ్వేనా ఇలా మాట్లాడేది. నీ మాటలు నన్ను ఆశ్చర్యపరచడమే కాదు, బాధను కూడా కలిగిస్తున్నాయి. నా కన్నా ముప్పై ఏళ్ళు చిన్నదానివి. 'మేరా భారత్ మహాన్' అనే నాట్యరూపకంలో మతసామరస్యాన్ని గురించి ఎలుగెత్తి చాటిన దానివి. 'మనదంతా వసుధైక కుటుంబం' అంటూ కాలేజీలో ఉపన్యాసం దంచి బహుమతి గెలుచుకున్నదానివి. చూడమ్మా, నేనేదో సమైక్యత, సంఘోద్ధరణ అంటూ ఈ పనికి పూనుకోలేదు. ఒకే బాటలో పయనిస్తున్న ఒంటరి బాటసారులం మేం. ఏదో వయోవృద్ధుల గృహంలో చేరి మాకున్న కొద్దిపాటి ఉనికినీ కోల్పోయి బతకడం ఇష్టం లేని ఆత్మాభిమానం కలవాళ్ళం. స్వతంత్రంగానే అయినా ఒకరికొకరం అండగా బతకడానికి నిశ్చయించుకున్నవాళ్ళం.

మహానుభావుడు మీ నాన్న. ఈ ఇంటిని నా



1857

పేర రాసి నాకింత స్వేచ్ఛను ప్రసాదించారు.

లేకుంటే పరిస్థితి ఎలా ఉండేదో. రమా, నా బతుకును నన్నిలా కడతేర్చనీ.

ఎప్పుడైనా చూడాలనిపిస్తే తప్పకుండా రా. ప్రమోద్‌తో కూడా అదే చెప్పు.

మీరు నా పిల్లలు. నన్ను చూడ్డానికి మీకు అనుమతి అవసరం లేదు. మీకై ఈ ఇంటి తలుపులు తెరిచే ఉంచుతాను. అంతేకానీ, నా జీవితాన్ని, నా జీవనశైలిని శాసించే హక్కు మాత్రం మీకు లేదు."

ఎంతో స్థిరంగా మాట్లాడుతున్న తల్లికేసి విస్తుపోయి చూస్తూ ఉండిపోయింది మనోరమ.

కాసేపు మౌనం వహించిన మనోరమ ఏమనుకుందో, "సరేమ్మా. ఇప్పటికీ పద్ధతి బాగానే ఉన్నట్లు అనిపిస్తోంది. ఇంకా వయసు పైబడి, కాళ్ళూ చేతులు ఆడక వేరొకరి మీద ఆధారపడే పరిస్థితి అంటూ వస్తే..." అర్థోక్తిగా ఆపేసింది.



"ఓహో, అదా నీ అనుమానం. చూడు రమా, మనం ఎప్పుడో నిస్సహాయులమవుతామని ఇప్పటి నుండి పరాయివాళ్ళ మీద ఆధారపడి బతకడం నాకిష్టం లేదు. రాబోయే రోజులను గురించి నేను ఆలోచించను. ముగ్గురు స్నేహితులం - అందరం ఒకేమారు కట్టకట్టుకొని మంచాన పడ్తామని నేననుకోవడం లేదు. ఒకవేళ ఆ పరిస్థితి వస్తే బోలెడన్ని నర్సింగ్ హోమ్‌లు, ఓల్డేజ్ హోమ్‌లు ఉన్నాయి చూసుకోవడానికి."

"ఛ... ఛ... ఏంటమ్మా, నువ్వు మరీ విడ్డూరంగా మాట్లాడుతున్నావు. ముగ్గురు బిడ్డల తల్లివై ఉండి అనాథలా ఎందుకాలో చిస్తున్నావ్?" కినుకగా అంది మనోరమ.

"లేదు. నేను ప్రాక్టికల్‌గానే ఆలోచిస్తున్నాను. ఈనాటి ఈ నవ సమాజంలో ఏ ఒక్కరూ ఏ ఒక్కరి కోసమో బతుకుతాడనో, బతుకుతుందనో, బతకాలనో భావిస్తే అది అవివేకమే కాదు, వెర్రితనం కూడా. మన జీవితాలు పూర్తిగా మనవే. వాటిని నిర్దేశించుకోవడంలో మనకు ఏది ఆనందాన్ని, సంతృప్తిని కలిగిస్తుందో దాన్ని ఆచరించడంలో తప్పు లేదు. అందునా వేరే వాళ్ళకి కష్టం కలిగించకుండా జీవించడం కూడా ఎంతో అవసరం."

నిర్దిష్టంగా, దృఢంగా తెగేసి మాట్లాడుతున్న తల్లికేమని సమాధానం చెప్పాలో స్ఫురించక మ్రాన్పడిపోయింది మనోరమ.

మొదటి నుంచి అమ్మ పంథా అమ్మదే. తనకేది ధర్మమని తోస్తే అది ఎంత కష్టమైన పనైనా అక్షరాలా చేసి తీరేది అమ్మ.

అమ్మ తీసుకొన్న నిర్ణయంలో తప్పేమిటో తెలుసుకోలేకపోయిన మనోరమ తల్లి వద్ద కొద్ది రోజులు గడిపి కొంత అనంతృప్తితో వైజాగ్ వెళ్ళిపోయింది.

* * *

అలా పేయింగ్ గెస్టులంటూ తన స్నేహితురాండ్రని తన చల్లని లోగిలిలోకి చేర్చుకొని శాంతియుత సహజీవనం చేస్తూ, క్రమేణా తన వ్యాపకాన్ని కొంత విస్తృత పరచుకుంది విమల.

అనాథాశ్రమంలోని పిల్లల బాగోగులు, వాళ్ళకి ఫీజులు, యూనిఫామ్‌లు, పుట్టినరోజులు అంటూ తన సంపాదన పరిధిలోనుంచి సహాయ సహకారాలు అందించసాగింది.

అమ్మ తీసుకొన్న నిర్ణయంలో తప్పేమిటో తెలుసుకోలేకపోయిన మనోరమ తల్లి వద్ద కొద్ది రోజులు గడిపి అనంతృప్తితో వైజాగ్ వెళ్ళిపోయింది.

వృద్ధుల హోమ్‌లోని నిస్సహాయులైన పేదలకు బట్టలు, కళ్ళజోళ్ళు, పండుగలకు పబ్బాలకు స్వీట్లు పంచిపెడుతూ, అనాథలైన వృద్ధులను ఆదరంగా, ప్రేమగా పలకరిస్తూ, వారితో చెలిమి చేస్తూ వారి అభిమాన అనురాగాలను చూరగొంది.

'అమ్మకు తమ అవసరం, ఆసరా ఏనాటికైనా కలగకుండాపోతుందా' అని ఎదురు చూసిన విమల సంతానానికి చివరకు నిరాశ మిగిలింది.



ఓ నాటి రాత్రి ఉన్నట్లుండి చిన్నపాటి గుండె నొప్పితో అనాయాసంగా నిద్రలోనే ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోయింది విమల.

ఫోన్ ద్వారా అమ్మ మరణ వార్త విన్న కొడుకు ప్రమోద్, కూతురు మనోరమ హుటాహుటిన వచ్చారు అంత్యక్రియలకు.

విమల ఆఖరి కోర్కేమిటో విశ్వం చెప్పగా విన్న అన్నలు, చెల్లెలు నిశ్చేష్టులయ్యారు.

"నీ కళ్ళని ఐ బ్యాంక్‌కి, నీ శరీరాన్ని స్థానిక మెడికల్ కాలేజీకి దానం చేసి మరణంలో కూడా నీ విశిష్ట వ్యక్తిత్వాన్ని నిలువుకున్న స్థితప్రజ్ఞురాలివమ్మా నువ్వు" అంటూ అశ్రునయనాలతో అమ్మకు నివాళులర్పిస్తూ, అమ్మ (అ)మృతదేహం చెంత నిలుచుండిపోయింది మనోరమ. ■